
# నేను కోరుకునే మరుజన్మ



## మధురాంతకం రాజారామ్

**దేవుడు గనుక నాకు ప్రత్యక్షమై "నరుడా! నీవు కోరుకునే మరుజన్మ ఏదో చెప్పు. దాన్ని తప్పనిసరిగా నీకు ప్రసాదించే పూచీ నాది!" అంటాడనుకోండి. నేను రాష్ట్రపతిని కావాలని కోరుకోను. ప్రధానమంత్రి, గవర్నరు,**

ముఖ్యమంత్రి, మొదలైన ముళ్లకిరీటాల సంగతి మనసులోకే రానివ్వను. ఇంజనీరు, డాక్టరు, ప్రొఫెసరు అంటూ ప్రత్యామ్నాయాలు చూపించినా సరే, రవివర్మ చిత్రంలో మేనకకు పెడముఖం పెట్టిన విశ్వామిత్రునిలా "పో, పో! వద్దువ" ద్దంటాను.

"పోనీ, సినిమా హీరో కావడం గురించి నీ అభిప్రాయమేమిటి?" అంటూ దేవుడు మరొక ప్రతిపాదన చేస్తాడనుకోండి!

"స్వామీ! ఆ మాటమాత్రం నాతో చెప్పొద్దు. హీరో అంటే నాకు బొత్తిగా గిట్టదు. వాడితో నాకు బద్ధవిరోధం. కేవలం జన్మవైరమనుకోవద్దు. జన్మజన్మాల వైరం" అంటాను.

ఎంత చెడినా దేవుడు మాత్రం ఎంతో కొంత సూక్ష్మగ్రాహి అయివుండడా? ఇంత దూరం వచ్చాక, నా ఇంగితం గ్రహించి, "ఏమిటి నాయనా! నువు కొంపదీసి విలన్ కావాలనుకుంటున్నావా?" అని ప్రశ్నిస్తాడు.

నేను అవకాశాన్ని చేజారిపోనిచ్చే వాడినేనా? "ధన్యుణ్ని స్వామీ! నా ధ్యేయం అదే! ఆ వరం నాకు ప్రసాదించండి!" అంటాను.

దేవుడు డంగైపోవడం ఖాయం! బెంబేలు పడిపోతూ "ఇదేం ఘోరకలి నాయనా! తియ్యమామిడి చెట్టుగా పుట్టాలనుకుంటారు గానీ,

## భారీ లాక్ సిస్టమ్

ప్రపంచంలో భారీయెత్తున తాళం బిగించే(లాక్ సిస్టమ్) విధానం సెంట్రల్ అమెరికాలోని పనామా కాలువ వద్దగల మిరాఫ్లోర్స్ సిస్టమ్! ఇది 1914 ఆగస్టు 15న అమలు చేయబడింది. కింది రెండు తాళాలు 1,050 అడుగుల పొడవు, 110 అడుగుల వెడల్పు కలిగి ఉండగా, ద్వారాలు 82 అడుగుల ఎత్తు, 65 అడుగుల పొడవు, ఏడు అడుగుల మందంతో ఉన్నాయి. ప్రతి ఎక్క తలుపు 730-780 టన్నుల బరువు కలిగి ఉంది.

శ్రీకొండ, ఎర్రబోడు

విషముష్టి చెట్టుగా పుట్టాలనుకుంటారా ఎవరైనా? గంగగోవుగా ప్రభవించాలనుకుంటారేగానీ, ఖడ్గమృగంగా జన్మించాలనుకుంటారా? పావురంగా జీవించాలనుకుంటారుగానీ, రాబందులా మసలాలనుకుంటారా?" అంటూ నిర్ఘాంతపడిపోతాడు.

అప్పుడు నేనంటానుగదా, "చాల్చాల్లేవోయ్ దేవుడా! నన్ను లోకజ్ఞానం లేనివాడి కింద లెక్కగట్టావేమో! ఆకులకు, కాయలకు, కలపకు మామిడిచెట్టునైతే హింసిస్తారుగానీ, విషముష్టి చెట్టువైపు తేరిపారజూచేదెవ్వరు? పాలు వట్టిపోగానే గోవును కబేలాకు తోల్తారుగానీ, ఖడ్గమృగం జోలికొచ్చేవాళ్లెవరు? పావురమంటే అందరికీ అలుసే! రాబందును చెనకే వాళ్లెవరు? అంతెందుకు, నీ ఇంటి కాంపౌండులో జరిగిన విషయాన్నే నువ్వు మరిచిపోతే నేనేం చెయ్యగలను? జయవిజయులంటే ఎరుగవా? నీ ఇంటి ద్వారపాలకులే గదటయ్యా! నీ సముఖానికి రావడం కోసమని సింహద్వారం దాటబోతున్న ఋషులెవరినో వీల్లేదని అటకాయించేటప్పటికి, వాళ్లు కోప్పడిపోయి 'మీరు భూలోకవాసులై పోదురు గాక!' అని జయవిజయుల్ని శపించారటగదా! అప్పుడు నీ ద్వారపాలకులు కాళ్లావేళ్లాపడి శాపవిమోచనం కోసం మొత్తుకుంటే ఋషులేమన్నారు? 'పూర్తిగా శాపనివారణం సాధ్యంగాదు. మీరు కొంత కాలమైనా భూలోకానికి వెళ్లి రావలసిందే! నూరు జన్మలు శుద్ధసాత్వికులుగా వున్నాసరే, మూడు జన్మలు క్రూరకర్కశులైన దుర్మార్గులుగా వున్నాసరే, ఛాయిస్ మీది!' అనేటప్పటికి జయవిజయులిచ్చిన సమాధానం నూటికి కోటికి విలువైనదిగదా! వాళ్లేమన్నారు? 'ఉప్పూకారం లేని చప్పిడి తిండి తింటూ శుద్ధబుద్ధావతారాలలాగా నూరు జన్మలు బ్రతికే శిక్ష మాకొద్దే వద్దు! మాటే చట్టంగా, చూపే శాసనంగా, హుంకారమే ఉత్పాతంగా మూడుజన్మలు జీవించే వరమే చాలు, అదే పదివేలు!' అనలేదా?"

-ఇట్లాగని నేను నిలదీసి అడిగేశానంటే ఎంత దేవుడైనా ఊపిరాడక నిరుత్తరుడై పోడంటారా? సరే, అతగాడి సంగతి వదిలేద్దాం. బుద్ధిమంతులు గనుక నా ఆంతర్యాన్ని సూటిగా మీకే నివేదించుకుంటా! వరుసగా హిరణ్యాక్షహిరణ్యకశిపులుగా, రావణకుంభకర్ణులుగా, శిశుపాలదంతవక్త్రులుగా జన్మించినవారు జయవిజయులేనని తెలుసా మీకు? భూమినంతా చాపగా చుట్టి భుజాన పెట్టుకుని పోయాడంటే హిరణ్యాక్షుడు ఎంతటి దుర్వారభుజశక్తి కలిగివుండాలి? 'సూర్యుడు ఆకాశంలో వెలగాలన్నా, గాలి కొంచెం విసురుగా వీచాలన్నా, అగ్ని నాలుకలు సాచాలన్నా, యముడు జీవుల ప్రాణాలు తీయాలన్నా అదంతా నా ఆదేశానికి లోబడే జరగాలి!' అన్నాడంటే హిరణ్యకశిపుడు ఎంత ధీమా కలిగినవాడై వుండాలి? రెండో జన్మలో ఒకడు అరివీరభయంకరుడై కుబేరుణ్ని గడగడలాడించి, దేవతల్ని కారడవులకు పారదోలి, కోసలరాజు కోడల్నే చెరబట్టగా, శలభాల్లా వానరవీరుల్ని నలిపి పారేసిన వాడింకొకడు కాడా! అకాలమరణం పాలైన దంతవక్త్రుని మాటకేంగానీ, బ్రతికినంతకాలం శ్రీకృష్ణుణ్నే వేపుకతిన్న ఘనకీర్తి ఎవరిది? గోపాలుడి గుండెల్లో నిద్ర పోయినవాడు శిశుపాలుడేగదా! అలాంటి మహామహులకు తొలిపూజ కావించవలసిన కర్తవ్యం మనకుండా లేదా-మీరే చెప్పండి!

అయ్యో! పిరికిమందు పోసేవాళ్లప్పుడూ వుంటారు. వాళ్ల మాటలు నమ్మి విలన్ల పరంపర అంతరించి పోతుందని భావించనే వద్దు! రోమ్ నగరం కాలిపోతుండగా ఫిడేలు వాయిస్తూ మురిసిపోయిన నీరో చక్రవర్తి, శ్రీశ్రీగారి చేత మహాహంతకులుగా కీర్తించబడిన నాదిర్షా, ఘజనీ, ఘోరీ, చెంఘిస్‌ఖాన్, తామర్లేనులు, ఇటీవలి కాలంలో హిట్లర్, ముసులోనీలు, వాళ్ల సంతతివారు కారా? బాలీవుడ్ సినిమా పరిశ్రమను పాదాక్రాంతం కావించుకున్న మాఫియా కింగులను, పల్లె నుంచీ ఢిల్లీవరకూ దిగ్విజయంగా సమాంతరప్రభుత్వాల్ని నడుపుకొస్తున్న రౌడీలను, దాదాలను, గూండాలను మీరెందుకు ఆదర్శ విలన్లుగా గుర్తించడం లేదో నాకు బోధ పడడంలేదు. ప్రజాస్వామ్యపరిపాలనల్లో అవినీతిపరులకు చోటుండదంటారేమో! ఓరి మీ పిచ్చి దొంగల్దోలా! ఎంతటి అమాయకులయ్యా మీరు! గడచిన లోకసభ ఎన్నికల్లో ఎన్నోచోట్ల తిరుగులేని విజయాన్ని సాధించి వోటర్లు పడుతున్న బ్రహ్మరథంపైన ఊరేగుతున్న విలనోత్తముల నిత్యనూతన ప్రతాపగాథల్ని తనివితీరా విని తరిస్తున్న వాళ్లం మనం కామా!

బాబూ! ఈ నేపథ్యంలో నుంచే గదండీ మరుజన్మలో నన్ను (అసలు విలన్‌గా గాకపోయినా) సినిమా విలన్‌గానైనా పుట్టించమని కోరుకున్నది! హీరోగూడా పుట్టాడు. ఎందుకూ, పుట్టెడాముదాలకు-లేదా మూడు డ్రమ్ముల గ్రైప్ వాటరుకు, ఆరుడబ్బాల ఫారెక్సుకూ చేటుగా తప్పితే! పెందలకడనే నిద్రలేచి, పాఠములు శ్రద్ధగా చదువుకుని, వేళకు బడికేగి, గురువులయెడల భక్తి కలిగియుండి, సాయంకాలాల్లో ఆటలాడుకునే మంచిబాలుడి మాదిరిగా గీటు దాటకుండా, చిరుతిండ్లు తినకుండా, కొత్త కొత్త రుచులు ఆస్వాదించకుండా, ఆనందదేవత పూనకంలో తూలకుండా-ఛీఛీ, ఆ హీరోగాడిది గూడా బ్రతుకేనా? కష్టాలు, నష్టాలు, త్యాగాలు, అవమానాలు, అపోహలు, ఆవేదనలు, ఆక్రందనలు ఇంతేగదండీ వాడిబ్రతుకు! సినీవిలన్ సంగతలా కాదే! నివాసాలకా ఇంద్రభవనాలు. సరాగాలకా అప్సరలు. విలాసాలకా స్విమ్మింగు పూల్సు. సేదదీరడానికా నైట్ హోర్సులు, ఓల్డ్‌మాంకులు! ప్రత్యర్థులంటేనా అతని ముందు ఈగలూ, దోమలూ! పేరూకీర్తిగా బ్రతుకుబ్రతుకంతా అలా బ్రతకాలన్నదే నా ధ్యేయం! చివరి సీన్‌లోనైనా హీరో చేతిలో చస్తాడా లేదా అంటారేమో! చస్తే మాత్రం ఏమైపోతుంది సార్? 'పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం' అన్నట్టుగా విలన్ ఈ సినిమా ఆఖరు సీనులో చనిపోవడం తరువాతి సినిమా తొలిసీన్‌లో పుట్టడానికే గదండీ! అందువల్ల నేను చెప్పేదేమిటంటే సర్వకాలాల్లోనూ సర్వదేశాల్లోనూ విలన్లదే రాజ్యం! రాజ్యం విలన్లదే! ఇదే మన నినాదం!

■